# 13. తెల్లబోయిన వీలునామా

'**జ**గదీశ్వరుడతడెవడో అగపడితే బాగుండును' అనే శ్రీశ్రీ సూక్తి నాకెప్పుడూ గుర్తొస్తూ ఉంటుంది. ఎందుకంటే అలా కనపడినవాణ్ణి నిలదీయవలసిన ప్రశ్నలు చాలా ఉంటాయి, మానవ మాత్రులకి. అందరి మాటా ఎందుకుగాని ఇన్నిన్ని హార్టు ఎటాక్స్ వచ్చినా ఈ మూడు కాళ్ళ ముసలమ్మ ఎప్పటికప్పుడు తేరుకుని పెళ్ళికూతుర్లా కబుర్లు చెప్పడమేమిటి చెప్పండి! "రామకోటి ఇంకా పూర్తవలేదుగా, అందుకే ఆ శ్రీరామ చంద్రమూర్తి నన్ను మళ్ళీ మనుషుల్లో పడేశాడేమో! ఇంకా చూస్తావేం, నా పెన్నూ ఆ ఎక్సర్‌సైజు బుక్కూ నాకు అందించక!" అంటూ అరిచినంత పని చేసింది ఆండాళమ్మ గారు. నలుగురూ సాయంబట్టి కిందకి ఎప్పుడు దించుతారా అని కన్న కూతురే ఆశతో ఎదురుచూస్తుంటే ఇంకా అదీ ఇదీ అందించమంటుందేమిటి!

ఆండాళ్ళమ్మగారికి బాగా ఆస్తి ఉందిగాని వృద్ధాప్యంలో ఆదుకునే వాళ్ళెవరూ లేరు. ఉన్న ఒక్క కూతురూ రెండు విమానాలు మారితే ఇరవై నాలుగ్గంటల్లో చేరేటంత దూరంలో విదేశంలో స్థిరపడి పోయింది. విమలా జోసఫ్ అనబడే ఆ అమ్మాయికి తల్లి ఆరోగ్యం కన్న ఆవిడ వల్ల లభించే ఆస్తి మీదే దృష్టి ఎక్కువ.

ఇక్కడ నా గురించి పూర్తి పరిచయం చేసుకుంటే తప్ప జరిగిన సంఘటనలో నా ప్రమేయం మీకు బోధపడదు. నేను వ్యక్తురాలనైన దగ్గిర్నుంచీ నేను ధరించే దుస్తుల గురించి మా అమ్మకీ, నాన్నకీ హోరాహోరీ యుద్ధం అయిపోయేది. కేరళకి చెందిన మా అమ్మ పైన చొక్కా కింద గూడకట్టు పంచెతో చూడాలని పట్టు పట్టేది. నాన్న తెల్గూ చౌదరి గనక పరికిణీ,ఓణీలతో ఉండాలని ఒకటే గోల. ఇంతకీ మీతో చెప్పకేం. నా బాడీలో ఎత్తులూ, పల్లాలూ అంతంత మాత్రమే గనక ఏ డ్రెస్సయినా ఒకటేగాని అమ్మ చెప్పిందే ఫ్రీ మూమెంట్‌కి అనువుగా ఉండేది. వాళ్ళిద్దరూ ఏ తగవు పడితేనేం నన్నెంతో ప్రేమగా చూసుకునేవారు. బియ్యెస్సీ కెమిస్ట్రీ చేశాను. కొన్నాళ్ళు లేబొరేటరీలో పనిచేశా కూడా. ఎక్కడ పని చేస్తేనేం, ఎలా కనపడితేనేం, మగాళ్ళ లైంగిక వేధింపులకి అంతూ దరీ ఉండేది కాదు. ఉన్నదంతా కుదువపెట్టి మా వాళ్ళు ఓ కర్కోటకుడికిచ్చి పెళ్ళి చేశారు. వెనకటికి ఓ తాబేలు రక్షణ కోరి ఓ ముని ఆశ్రమం చేరితే ఆ వెంటపెట్టిన వాళ్ళతో 'తప్పు నాయనా ప్రాణి హింస అన్యాయం. అంతగా దానికి మోక్షం ప్రసాదించాలని ఉంటే దాన్ని తిరగేసి ఓ పెట్టు పెట్టండి' అనే దయపూరిత సలహా పారేశాడుట! మా అత్తగారు ఆ మునికి మార్గదర్శి అయి ఉండాలి! ఆ తల్లీ కొడుకూ నన్ను పెట్టిన హింస ఇంతా అంతా కాదు. ఓసారి ఇద్దరూ కలసి పచ్చడి చేసి ఓ గదిలో పడేస్తే ఎలాగో బయటపడి తిన్నగా పోలీసు స్టేషనుకి వెళ్ళి రిపోర్టిచ్చాను. ఇక వాళ్ళిద్దరూ నా వంటి మీద చెయ్యి వెయ్యడానికి వీల్లేకుండా నా చేత రిపోర్టు చేయించి తను స్వయంగా వెళ్ళి హెచ్చరించి మరీ వచ్చాడు. ఇంకొకరు నా మీద చెయ్యి వెయ్యకుండా కట్టుదిట్టం చేశాడంటే ఆ పని తన వల్లే జరగాలని అతి తొందర్లోనే రుజువు చేశాడు

పోలీసు బాబు. వీడు నా మొగుడంత శాడిస్టు కాకపోవడం కొంతవరకూ నయమే. ఆడదై పుట్టాక అడుగడుగనా ఎడ్జెస్టుమెంట్సు తప్పవని మూడు పదులు రాకుండానే పాఠం నేర్పింది నాకు నా జీవితం. అయితే ఓ ఎన్‌కౌంటర్‌లో అతను ఫైర్ అయిపోవడంతో ఆ కాస్త నీడా అందకుండా పోయింది. అదిగో అప్పుడే రుక్మిణమ్మగారి పత్రికాప్రకటన నా కళ్ళ పడింది.

రుక్మిణమ్మ ఆండాళ్ళమ్మగారి దూరపు బంధువూ, చిన్ననాటి ఫ్రెండూ. ముసలితనంలో ఎలాంటి ఆసరా లేక ఆవిడ ఆండాళమ్మ గారి పంచ చేరిందట. గత అయిదారేళ్ళలో ఈవిడకి ఇంచుమించు అన్ని దంతాలూ ఊడిపోయి, కూచుంటే లేవలేని కీళ్ళవాతంట. అలాంటి రుక్మిణమ్మ తనైతే కష్టం మీద కాలకృత్యాలు తీర్చుకురాగలదు గాని హార్టు ఎటాక్ వచ్చి మంచం మీదే ఆండాళమ్మ చేసే 'అకాల కృత్యాలు' ఎవరు శుభ్రం చేయగలరు? ఇద్దరూ ఆలోచించి 'ఇంట్లో ఉండి అన్ని పనులూ నిర్వర్తించగల ఏ బాదరబందీ లేని, ఆరోగ్యం ఉన్న, నడివయసు ఆడమనిషి కావలెను. నెలకు తిండీ బట్టా కాక రెండు వేలు జీతం' అని ప్రకటన ఇచ్చారు. ఆ విధంగా, పరశురామమ్మ అనే నేను, అక్కడ చేరేను. వాళ్ళ దగ్గర ఓ ఆర్నెల్లు పనిచెయ్యడం కాదు గాని జీవితం అంటే రోజు రోజుకీ ప్రేమ పెరిగిపోజొచ్చింది నాకు. ఎన్నిసార్లు పిలిచినా ఏ మాత్రం విసుక్కోకుండా, ఎలాంటి పని చెప్పినా ఎదురు చెప్పకుండా సేవ చెయ్యసాగేను. అంతటి చల్లని తల్లి ఆండాళమ్మ కడుపున పుట్టిన విమలా జోసఫ్ ఎంత స్వార్థపరురాలో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. "ఇదంతా మా మమ్మీకి వాళ్ళ పుట్టింటి వారిచ్చిన ఆస్తి. ఒక్క వీలునామాతో ఎవరికైనా రాసెయ్యవచ్చు. ప్రతి పైసా నాకే రాయాలిగాని ఇంకెవరున్నారని! ఏదో కాన్ఫరెన్సుతో తప్పక వచ్చానుగాని ఈ ముసలికంపు ఎంత తల్లి అయితే మాత్రం ఎవరు భరించగలరు! డబ్బుకి ఆశపడి మలమూత్రాలు దేవుతున్నావుగాని ఒక్క నిమిషం నా లాంటిది ఇక్కడ ఉండలేదు. అందుకే హోటల్లో దిగేను. నీతో చెప్పకేం, మా మమ్మీ ఎప్పుడు ఢాం అంటుందా అని వెయ్యి కళ్ళతో చూస్తున్నాననుకో" ఈ సంభాషణ ఒక్క అక్షరం పొల్లుపోకుండా తల్లి చెవిలో పడిందని విమల ఎరగదు. విమలని యిలా యిల్లు కదలనిచ్చి ఆండాళమ్మ గారికి హార్ట్ ఎటాక్ లాంటిది వచ్చింది. రుక్మిణమ్మగార్ని అక్కడ కూచోబెట్టి డాక్టర్ని అంబులెన్స్‌తో సహా రప్పించి ఆ ప్రమాదం తప్పించే అన్ని ప్రయత్నాలూ చేశాను. ఆ ఉధృతం తగ్గి ఇల్లు చేరి మామూలు మనిషి అవడానికి ఓ వారం పట్టింది. మాటాడే శక్తి రాగానే ప్లీడరు గారికి కబురు పెట్టి తన తదనంతరం అంత ఆస్తీ రుక్మిణమ్మకి నాలుగో వంతు, మిగిలినది నాకూ వీలునామా రాసింది. ఆ వేళకి విమల ఇంకా దేశం వదల్లేదు. బెంగుళూర్లో ఎవరో ఫ్రెండుందిట, ఆ ఫోన్ నెంబరు నా కిచ్చింది. డాక్టరు చెప్పిందేమిటంటే ఇంకో ఎటాక్‌కి ఆ గుండె తట్టుకోలేదని. ఆ విషయమే విమలకి ఫోన్ చేశాను. ఫర్దర్ ఎపాయింట్‌మెంట్స్ అన్నీ కేన్సిల్ చేయించుకుని నెక్స్ట్ ఎవైలబుల్ ఫ్లయిట్‌లో వచ్చేసింది.

లాయరు ఫ్రెండు వీలునామా సంగతి చేరేసి ఉంటాడు. విమల ప్రవర్తనే నిమిషాల మీద మారిపోయింది. తల్లి మీద ఎక్కళ్ళేని ప్రేమా ఒలకబోసింది. రక్త సంబంధానికి అంత బలముంటుందనీ,

కూతురి పట్ల తన అభిప్రాయం ఆండాళమ్మ అంత త్వరగా మార్చుకోగలదనీ నేను కలలో అనుకోలేదు. నన్నే కాదు, రుక్మిణమ్మగారిని కూడా తల్లి దగ్గరకి రానివ్వక తనే అన్ని పనులూ ప్రత్యేక శ్రద్ధతో చేసింది. ఆ వెర్రితల్లి కూతురి కుట్రలో నిమిషాల మీద పడిపోయింది. బజారు కెళ్ళినట్టు వెళ్ళి ఓ లాయర్ని కనుక్కున్నాను వీలునామా విషయం. బతికున్న మనిషి మళ్ళీ మళ్ళీ వీలునామా మార్చి రాయవచ్చునట. ఆఖర్ని ఏదైతే రాసిందో అదే చెల్లుతుందట. తల్లి చనిపోతే రుక్మిణమ్మ గారిని తీసుకుని నేను వెంటనే ఇల్లు విడిచి వెళ్ళిపోవాలట. ఇన్నాళ్ళూ వాళ్ళమ్మకి చాకిరీ చేసినందుకు అయిదు వేలు నాకిస్తుందిట. నేనేమీ అనడానికి వీలులేదుగాని కన్నతల్లినే మోసం చేసి మనసు మార్చిన విమలకి ఎలా బుద్ధి చెప్పాలా అని ఆలోచిస్తున్నాను.

ఆ మర్నాడే, అందరి సమక్షంలో ఆండాళ్ళమ్మ కొత్త వీలునామా తయారు చేసింది. 'చూస్తావేం, నా పెన్నూ, తెల్లకాగితం తీసుకురా' అంటూ నన్ను పురమాయించింది. ఆవిడ బాల్‌పెన్ను వాడదు. ఇదివరకు రామకోటి రాసినప్పుడూ పెన్నులో ఇంకు పోసి అందించడం నాకూ మామూలే.

"పెడపర్తి ఆండాళ్ళమ్మ అనే నేను, ఎవరి ప్రోద్బలమూ లేక, ఏం రాస్తున్నానో రాయగల మనశ్శక్తి ఉన్న నేను, నా యావదాస్తీ నా ఏకైక వారసురాలూ, కూతురూ అయిన విమలా జోసెఫ్‌కి, ఇందు మూలముగా చెందునట్లు రాస్తున్నాను"

సంతకం చేసి ఇచ్చిన ఆ కాగితం మీద నేనూ, రుక్మిణమ్మగారూ సాక్షి సంతకాలు చేసేశాం. ఆ కాగితం ఓ బ్రౌన్ కవర్లో పెట్టి మా ముందే గోద్రెజ్ బీరువా సీక్రెట్ అరలో పెట్టి ఆ తాళాలు బ్యాంకి లాకర్‌లో పెట్టి మరీ వచ్చింది విమల.

ఆ మర్నాడే వచ్చిన మాసివ్ హార్ట్ ఎటాక్‌ని తట్టుకోలేక ఆండాళ్లమ్మ కన్ను మూసింది. నా దుఃఖం నేనెలాగో కంట్రోల్ చేసుకోగలిగానుగాని శూన్యమైన ఆవిడ శయ్యని చూసి రుక్మిణమ్మగారి ఏడుపుని మాత్రం ఎవరూ అడ్డుకోలేకపోయాం.

తల్లి పోయిన వెంటనే మా యిద్దర్నీ సాగనంపాలని విమల అనుకుందిగాని ఆ పది రోజులూ జరిగే శవ సంస్కారాన్ని ఒక్కర్తీ తట్టుకోలేక మా యిద్దర్నీ కొన్నాళ్ళు ఉండమంది. అత్తగారు చనిపోయిన ఫోన్ కాల్ అందుకుని జోసఫ్ కూడా వచ్చాడు.

పది రోజులూ గడిచి, పదకొండో నాడు శుద్ధి స్నానాలు అయాక, బ్యాంకులోని లాకర్‌లో ఉంచిన తాళం చెవి తీసుకుని నలుగుర్లో కొచ్చింది విమల. ఆ వేళకి ప్లీడర్ని పిలిపించి ఆయన సమక్షంలో వీలునామా పెట్టిన బ్రౌన్ కవరు పైకి తీసింది. మా అందరి సమక్షంలో లోపలి కాగితం తీసి మడత విప్పింది. అందులో ఉన్నది కేవలం తెల్లకాగితం మాత్రమే! ఎన్నిసార్లు అటూ ఇటూ తిప్పి చదువుదామన్నా ఒక్క అక్షరం ముక్క లేందే! పొరపాటున ఇంకెక్కడైనా పెట్టేనేమో అని ఇల్లు తీసి పందిరేసినా కొత్త వీలునామా ఎక్కడా దొరకలేదు. ఆ విల్లు లేదు గనక అంతకు ముందు రుక్మిణమ్మకి నాలుగో వంతూ, నాకు మిగిలిందీ రాసిన వీలునామా చెల్లుతుందని ప్లీడరుగారు చెప్పేరు. ఇంతకీ

ఆండాళ్ళమ్మగారు స్వహస్తంతో రాసి సంతకం పెట్టిన వీలునామా కాగితం మీద అక్షరాలు ఏమయ్యాయి?" అనే ప్రశ్నకి జవాబు నా దగ్గిరుంది మరి!

కెమికల్ లేబరేటరీలో పనిచేస్తున్నపుడు 'కెమికల్ మేజిక్' అనే పుస్తకం చదవడం తటస్థించింది నాకు. నీటిలో కలిపి స్టార్చి సొల్యూషన్ తయారు చేసి, అందులో కొన్ని చుక్కలు అయొడిన్ వేస్తే బ్లూ బ్లాక్ సొల్యూషన్ తయారవుతుంది అది అచ్చు ఇంకు లాగే ఉంటుంది. దాన్తో ఏం రాసినా రాసిన నాలుగైదు రోజులకి మచ్చైనా మిగలకుండా పూర్తిగా మాయమయిపోతుంది. తెల్ల కాగితమే మిగులుతుంది. ఇప్పుడు జరిగింది సరిగ్గా అదే! ఆండాళ్లమ్మగారికి ఇంకుకి బదులు ఆనాడు నేను పెన్నులో పోసి యిచ్చింది అదే!

విమల మొగుడు జోసఫ్‌కి వల్లమాలిన కోపం. ఎప్పుడూ తాగుడు నిషాలోనే ఉంటాడు. 'ఏదో పొరపాటు చేసి ఉంటావు' అంటూ పదే పదే నిందిస్తూ విమలని కొట్టినంత పని చేశాడు. ఆ కాగితం ఇంతింత ముక్కలుగా చింపేశాడు చేసేది లేక ఆ మర్నాడే మూటా ముల్లె కట్టుకుని వాళ్ళు వెళ్ళిపోక తప్పలేదు.

రెండు గదులు మా కోసం ఉంచుకుని ఆ ఇల్లు అనాధ శరణాలయానికి ఇచ్చేద్దామని రుక్మిణమ్మని ఒప్పించాను. విమలా జోసఫ్‌కి కొప్పెట్టినంత ఆస్తి ఉందిట. కన్నతల్లే మాతో లాలూచీ అయి ఏదో చేసి ఉంటుందని ఆమె నమ్మకం. ఏం జరిగినా నేను చేసిన పనికి కలలో అయినా పశ్చాత్తాపపడే అవసరం నాకు లేదు. నా కంటూ ఓ మార్గం చూసుకోనేముందు, రుక్మిణమ్మని ఎలా ఓదార్చాలో అది ఆలోచించాలి.

★